నిశ్శబ్ద గీతం

కలగర వెంకట్రావు

తలుపు చప్పుడు విని బద్ధకంగా కళ్ళు విప్పాడు నందయ్య. లేవడానికి తటపటాయించే లోపల తలుపులు బద్దలయ్యేలా కొడుతున్నారు అవతల. విసుగ్గా లేచి కిటికీ నుండి చూస్తే.... చీకటి ఇంకా పలచబడలేదు. 'ఈ పెరుగు మామ్మకి అప్పుడే తెల్లారిందా!' అనుకుంటూ లేచాడు. నిద్రకళ్ళతోనే గదంతా వెతగ్గా ఓ మూల ఎక్కడో పాలగిన్నె కనిపించింది. అది పట్టుకొచ్చి తలుపు తీసాడు.

"ఈ వేళంత చీకటినే తెచ్చావేమిటి మామ్మా....!" ఆవులిస్తూ పెరుగుతట్ట సాయంపట్టి అరుగుమీద దింపాడు. తలమీద చుట్టుగుడ్డ పడితే........ వొంగుని పైకి తీసింది పెరుగు తెచ్చి

నామె. ఆమెను చూచి నిశ్చేష్టుడయ్యాడు నందయ్య. కళ్ళు నులుముకుని మరీ చూసాడు.

"ఉయాల పెరుగు మామ్మకి ఒంటో బాగోలేదండి.... నన్నట్టికెళ్ళమంది." పెదవులు కొంచెంవిప్పి సన్నగా నవ్వింది. పెరుగుముంత తీసి అతని కిచ్చి అల్యూమినియం గిన్నెతో పాలు రెండుగ్లాసులు కొలిచి పాలగిన్నెలో పోసిందా యువతి. నందయ్య ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే పాలగిన్నె, పెరుగుముంత తీసుకుని లోపలికెళ్ళాడు. కాస్సేపటికి దీపంతో బయటకు వచ్చి డబ్బులు ఆమె చేతికిచ్చి — "పెరుగు మామ్మకి ఏమౌతావు నువ్వు?" అని అడిగాడు దీపంకాంతిలో ఆమెను పరిశీలనగా చూస్తూ — చామనఛాయకి ఎరుపురంగుకి మధ్య వర్ణంగల శరీరం తొలి యవ్వనం సొగసులను భరిస్తోంది. ముఖంలో ఏ భావం వ్యక్తం కావడం లేదు. మరీ విశాలం కాని.... కాటుక లేని కళ్ళలో చాంచల్యం రెపరెపలు యింకా చోటుచేసుకోలేదు. అతని మాటకు ఏమీ సమాధానం ఇవ్వకుండా బొడ్లోంచి చిన్న గుడ్డసంచి బయటకు తీసి నందయ్య యిచ్చిన డబ్బులు అందులో వేసుకుంది.

"ఇన్నిదివరకు చూసినట్టు లేదు. కొత్తగా తెస్తున్నావని కదూ అన్నావు"? ఆమెను తదేకంగా చూస్తూ అప్రయత్నంగా అడిగాడు.

"కొత్తేటిలెండి. ఇదప్పుడే మూడో వారం. ఆ ఈదిని శివుడిగుడికాడ పోత్తన్నాను. ఈదరికి రాటంలేదు" తనంత పొడుగున్న పాతగుడ్డని చక్రంలా చుట్టుచుట్టుకుని తలమీద పెట్టుకుంది.

"ఓ సెయ్యేయ్యండే!"

ఏమిటో ఆలోచిస్తున్న నందయ్య ఉలిక్కిపడ్డాడు. పెరుగుతట్ట సాయం పట్టి ఆమె తలమీద పెట్టాడు. తట్ట కొంచెం సర్దుకుని వెనక్కి తిరిగింది. నాలుగడుగులు వేసాక—

"ఇదిగో అమ్మాయ్ నీ పేరేమిటి?"

"అయ్ ఏటండి" వెనక్కి తిరిగింది.

"నీ పేరు...." అన్నాడు కొంచెం బిగ్గరగా

"ఎంకటలచ్మి". నవ్వుతూ చెప్పింది. ఆమె వీధిమలుపు తిరిగేవరకు చూచి లోపలకు వచ్చాడు నందయ్య. తెలతెలవారుతూ ఉంది కాస్సేపు పండుకుందామని మంచం దగ్గరకు వెళ్ళినవాడే హెడ్‌గుమస్తా 'హుకుం' గుర్తొచ్చి గూట్లో పండుంపుల్ల నోటిలో పెట్టుకుని అరుగుమీదకు వచ్చి కూర్చున్నాడు. కాస్సేపటికి రత్తి వచ్చి పాచిపని చేసి కాఫీపెట్టి....వచ్చినంత హడావుడిగాను పక్కింటికి పరుగెత్తింది. ఏడున్నర ప్రాంతంలో అన్ని పనులు ముగించుకుని నెమ్మదిగా సైకిలు ఎక్కి, గ్రామ పంచాయితీ ఆఫీసుకు దారితీసాడు

నందయ్య. ఎలిమెంటరీస్కూలు గేటు దాటగానే పెరుగు తట్టతో ఎదురొచ్చింది లక్ష్మి.

"ఇంకా అమ్మకం అవలేదేమిటి ?" సైకిలు స్లోచేస్తూ అడిగాడు పలకరింపుగా నవ్వి—

"అమ్మకం ఏంలేదండి... అన్నీ వాడి కలే .. ఆ సివర పంతులమ్మగోరికి పోసి బిల్లకట్టు ఎక్కేత్తమే !" అంది లక్ష్మి. యిరవై ఏళ్ళ నందయ్యలో మొదటి సారిగా ఏదో అలజడి ! ఆ అలజడిలో మరేదో సన్నిహితత్వం !!

హుషారుగా ఈల వేసుకుంటూ క్షణంలో ఆఫీసుకు చేరుకున్నాడు. బిల్లు కలెక్టర్, చిన్న గుమస్తా, లైబ్రేరియన్, పైపులైనుఫిట్టర్, శానిటరీమేస్త్రీ అంతా వరండాలో వరుసగా నిలబడి ఉన్నారు. హెడ్ గుమస్తా మాత్రం లేడు !! తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు నందయ్య. "హెడ్ గుమస్తా ఎక్కడ చచ్చాడు ?" తన సహోద్యోగి ఆదినారాయణ చెవి కొరికాడు.

"ఆఫీసర్‌గారితో వస్తున్నాడట..." అతని మాటలు పూర్తికాకుండానే జీపు రావడం.... ఒకరినొకరు తోసుకుంటూ ఆఫీసులోకి వెళ్ళడము ఒకేసారి జరిగాయి.

* * *

కొండాయిపాలెం మొత్తం మీద ఇరవై ముప్ఫై గడపలకంటె ఎక్కువ ఉండవు. ఉన్న ప్రతి కొంపకి ఒకటి రెండు పాడి గేదెలు మాత్రం తప్పకుండా ఉంటాయి. అక్కణ్ణుంచి పాలు, పెరుగుతో పుంతల వెంబడి రెండుమైళ్ళు నడచి పంటకాలువ దాటి వచ్చి మంద పాకలో అమ్ముతుంటారు. అలాగని చెప్పి మందపాక టౌను కాదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తణుకులో పనిచేసే వందలాది కార్మికులు గృహ వసతి కారణంగా ప్రక్కనే ఉన్న మంద పాకలో నివాసం ఏర్పరచుకున్నారు. అందువలన కొండాయిపాలెం నుండి అమ్మకానికి వచ్చే పాలు, పెరుగులకు పల్లెటూరే అయినా మందపాకలో మంచి గిరాకి ఉంది. అక్కడినుండి వచ్చె పెరుగుముసలమ్మ మామ్మ అంటే మందపాక మొత్తంలో తెలియనివారే లేరు.

* * *

"అమ్మో ! చచ్చానురో... ముంతలు పగిలిపోతాయి కొంచెం నెమ్మదిగా తోలరా సచ్చినోడా !" తట్ట గట్టిగా పట్టుకుంది పెరుగుమామ్మ. లక్ష్మి పక పకా నవ్వుతోంది. పుంతలో ఎత్తుపల్లాలకు బండి ఎగిరిపడుతోంది. ఇద్దరూ పెరుగు పోసివచ్చాక బిల్లకట్టు దాటి వీరయ్య బండి ఆపుచేయించి అందులో ఎక్కారు. ముంతలు పగిలిపోకుండా గడ్డి మీద పెట్టారు పెరుగు తట్టలు. వీరయ్య బండి రాత్రి రెండవ షిప్టులో తణుకు

చక్కెరమిల్లులో చెఱకు దిగుమతిచేసి, తిరిగి వచ్చేటప్పుడు మండపాకలో పెరుగుమామ్మను, లక్ష్మిని ఎక్కించుకుని కానీ పోదు. ఆ సమయానికి వాళ్ళు కూడా పెరుగంతా అమ్ముకుని, పంట కాలువ దాటివచ్చి, రావిచెట్టు క్రింద ఖాళీగంపలతో వీరయ్య బండికోసం ఎదురుచూస్తుంటారు.

పచ్చని పొలాల మధ్య తెల్లని దారి గట్టు.... తల దువ్వుకోవడంరాని అరపిల్ల తీసుకున్న పాపిటిలా ఉంది. పైరుగాలికి పంటచేలు ఆలాపించే నిశ్శబ్ద గీతికలు హృదయం నిండా ఆహ్లాదాన్ని నింపుతున్నాయి.

లక్ష్మికి మహా సరదాగా ఉంది—"ఒరేయ్ .... ఈరన్నయ్యా! తొట్లో ఓసారి లెగరా నే తోలతాను బండి." ఉత్సాహంగా అడిగింది.

పెరుగుమామ్మ నోరు నొక్కుకుంది.

"నువ్వేడన్నా పడివికాడినుంచి మీయమ్మ గోల యినలేక సావాలి .... ఆ మట్టికీని కూకో....!" వీరయ్య సమాధానంలో ముఖం మాడ్చుకుంది లక్ష్మి.

మామిడిచెట్టు మీద కూర్చొన్న కోయిల, ఎదురుగా విరహిణిలా తల విరగబోసుకున్న మర్రిచెట్టును ఉడికిస్తూ కొంటెగా పాటపాడుతోంది. చెఱువు గట్టున రకరకాల పక్షులు వింత సోయగాలతో చిన్నగా ఆటలాడుకుంటూ ఎగురుతున్నాయి.

బండి తాళ్ళచెఱువు దగ్గరకు వచ్చింది. అ పక్కచేలో ఎవరిదో చెఱకు నరుకుతున్నారు. వీరయ్యని బండిఆపి చెఱకు ముక్కలు తెమ్మంది లక్ష్మి. వీరయ్య బండి దిగివెళ్ళి రెండు ముక్కలు తెచ్చియిచ్చాడు. ఒకటి తను తీసుకుని రెండవది పెరుగుమామ్మకి యిచ్చింది.

"నేనేం తింటానే ముసలిముండని... పళ్ళా.... పాడా!" చెఱకుముక్క తీసుకుని తట్టలో పెట్టుకుంది. లక్ష్మి చెఱకు ముక్కతింటూ కూనిరాగం తీస్తోంది.

జాలువారిన కాంచనవర్షం జనపమొక్కలపై నిలిచిపోయినట్లుగ విరగబూసాయి జనపచేలు. వాటిమీద యధేచ్ఛగా తమ విహారాన్ని సాగిస్తున్నాయి రంగురంగుల సీతాకోక చిలుకలు!!

బండి మునసబుగారి చావడి తిన్నగా వచ్చేసరికి లక్ష్మి గావుకేక విని ఆపాడు వీరయ్య. బండిమీంచి చెంగున దూకి, చావిట్లోకి పరుగెత్తింది. కాస్సేపటికి ఆవుపేడ చేత్తో పట్టుకొచ్చింది. వీరయ్య మండిపడ్డాడు. లక్ష్మి అదేం పట్టించుకోకుండా చక్రం మీద కాలువేసి బండి ఎక్కింది.

"కుదురు.... కుంపటా పెట్టలేదే నీకా దేవుడు. ఆ బండెక్కితు మేటి ఆ వరపేటి పేదకేం ముంచుకు పోయిందిప్పుడు...." ముసలది దండకం ప్రారంభించింది.

"రోజూ మరిచిపోతన్నాను. సంకు

నాత్రి వచ్చేత్తంది. గొబ్బెమ్మలు పెట్టాలి. గోగిదండలు సెయ్యాలి..!" లక్ష్మి.

వీరయ్యకు నవ్వొచ్చింది. బండి వేగం హెచ్చింది.

* * *

లక్ష్మి ప్రతిరోజు మండపాక వచ్చి నందయ్యకు పాలు పెరుగు యిచ్చిపోతున్నది. లక్ష్మితో ఎంతసేపు మాట్లాడినా అలా మాట్లాడాలనిపిస్తుందేది అతనికి.

ఆమె అమాయకత్వం అందచందాలు అతన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. గత నెలరోజులుగా అర్థంకాని మానసిక అశాంతిననుభవించి చివరికో నిర్ణయానికి వచ్చాడు నందయ్య. వచ్చిందే తడవుగా పెరుగుమామ్మకి కబురుచేసాడు. సంగతి తెలిసాక ముసలిదాని ముఖం చాటంత అయింది. అతని రెండుచేతులు పట్టుకుని–

"నువ్వు మారాజువి" అంది. నందయ్య భయపడ్డాడు. తను మహారాజుకాడు. మహామంత్రికాడు. తనకి కావలసింది ఏమిటో తెలుసుకున్న మామూలు మనిషినని చెప్పాడు. అతని వెనుక ఎవరూలేరని తెలిసికొని, ఈ శుభకార్యం తన చేతుల మీదుగ జరగబోతున్నందుకు పెరుగు మామ్మ పొంగిపోయింది.

విషయం అంతా విన్నతరువాత–

"అప్పుడే దానికి పెళ్లేటి అత్తా....!" లక్ష్మి తల్లి నరసమ్మ అడిగింది. పెరుగు మామ్మ కూర్చొన్న గోనెపట్టామీంచి కొంచెం వొంగి–

"ఓసి తింగరముండా! యిప్పుడుదాకా నేను సెప్పిందేంటి.... నువ్వు అడిగే

దేంటి? తెలివితక్కువగా మాటాడక, దానిమొకాన రాసకలటున్నాయని నేనే నాడో సెప్పేను. బిల్లుకల్టు ఉజ్జోగం పేత్తన్న కుర్రోడు.... పైగా మనకులం ....కోరి మన్ని కనికరిత్తుంటే."

"అదికాదు.... దీని కింకా పదమూ డేళ్ళేకదా....!"

"అయ్‌బాబో... యిడ్డూరవా! మీ మాంగారు నన్ను పదోఏటనే గదంటే కాపరానికి ఈసుకొచ్చాడు. మొగ దిక్కు లేనిదానివి నువ్వు దానికింత కంటె మంచి సంబంధం తేగలవా? ఇంకేం అడ్డుసెప్పకు! నీ అడ్డాబాస సెరిపిచ్చి పిల్లదానికి పుత్తిముక్క సెయ్యమని కంసాలాయనకి యిచ్చాను...."

"అనానరంగా నీ అడ్డాబాస సెరిపిచ్చి...." నరసమ్మ యింకేదో అంటుండగానే-

"నువ్వేమీ సెప్పకే నర్సి! పిల్లదాని పెళ్ళికి నువ్వొప్పుకున్నమాట ఆ అబ్బాయి సెవినేత్తే కుసేలుగుంటాడు." పెరుగుకట్టమీద తాటాకు చదర ఒక దులుపు దులిపి గంప నెత్తిన పెట్టుకుంది.

* * *

పెళ్ళిమాట తలపెట్టగానే లక్ష్మిని మందపాక పెరుగు తీసుకెళ్ళడం మానెయ్యమంది నరసమ్మ. నందయ్య ఏమైనా అనుకుంటాడని ఆమె అభిప్రాయం. తోటి పెరుగుకట్టలు కూడా వేళాకోళం పట్టించే ధోరణిలో ఆ అభిప్రాయాన్ని బలపర్చాయి. అసలు పెళ్ళికి పెరుగుతట్టకి సంబంధమేమిటో అర్థం కాలేదు లక్ష్మికి. 'సింగినాదమేమీ కాదా' అంటూ అందరినీ తోసిపుచ్చి పెరుగు మాత్రం తీసుకెళ్ళడం మానలేదు.

నరసమ్మ నోరు నొక్కుకుంది. పెరుగుమామ్మ- "పోయేదేముందిలే... కుర్రతనం పట్టుకురానీ..." అని సర్ది చెప్పింది.

వేకువజామున ఆకాశం పెళ్ళిపందిరి దర్పాన్ని చూపిస్తోంది. చెమ్మగిలిన భూమి అలికిన కళ్యాణమంటపంలా ఉంది. తెలిమబ్బుల వలయాలు మామిడి తోరణాలుగా వేలాడుతున్నాయి. మబ్బుల మాటున దాగిన తారకలు వొలకబోసుకున్న నక్షత్రకాంతి వెలుగుజిలుగుల ముత్యాల రంగవల్లులుగ రూపుదిద్దుకున్నవి. ఈదురుగాలి నిశ్శబ్దంగ మంగళ వాయిద్యాలు వాయిస్తుంటే, నునుసిగ్గుల లేతబుగ్గలతో పెళ్ళిపందిరిలో కుడికాలు మోపింది లక్ష్మి. పెళ్ళికొడుకు తన సరసన కూర్చోకముందే వర్షపుచినుకుల అక్షితలు పడసాగినయ్!

"అమ్మాయి...లచ్చీ!" లక్ష్మి సుషుప్తి అస్పష్టతను పలుముకుంది.

"లచ్చీ!" చినుకులవేగం హెచ్చింది. లక్ష్మి ఊహాజగత్తు కరిగిపోయింది. ఎదురుగా పెరుగుమామ్మ! లక్ష్మి పెరుగు తట్ట తమ అరుగుమీద పెట్టుకుని యింత సేపు మామ్మకోసం ఎదురుచూస్తోంది.

"ఈ ముదనష్టపు నుయ్యేంటే నా పేణానికి... తెల్లారగట్టే ఈ ఒర లేని నూతిలో పడుదును కొంచెంముండే! మీ యమ్మముండకి ఎన్నిసార్లు చెప్పినా ఈ నూతికి ఒరలు పెట్టించదు." సణుక్కుంటూ లక్ష్మిదగ్గరకొచ్చి ఈ ఊదుగు గాలిలో తను రాలేనని. నాలుగు పెరుగుముంతలు లక్ష్మి తట్టలో పెట్టి ఎవరెవరికి ఇవ్వాలో వివరంగా చెప్పింది. వర్షం ఎక్కువైతే ఉంటుందని తట్ట మీదకు ప్లాస్టిక్ కాగితం ఒకటి యిచ్చింది. లక్ష్మి తట్ట నెత్తిన పెట్టుకున్నాక, కొంచెం వొంగి పద్దసుందారం ఒకటి తుంచి జడలో తురుముకుంది.

"రోజూ కొత్తే నేచె.... యిడిసి యిడిసి పువ్వు నలా కొయ్యొద్దంటే నీక్కాదంటే పిల్లా! ఒచ్చేతప్పుడు ఎర్రికొయ్యలాగ ఓనలో తడవక ఆ కాయితం సరిగ్గా ఏసుకో..!" పెరుగు మామ్మ చెబుతూండగనే పూలమొక్కలు దాటి సంతలోకి వచ్చింది లక్ష్మి.

చలిగాలి గుండెకోతకోస్తోంది. వర్షం జల్లులు జల్లులుగా పడుతోంది. వర్షంలో తడిసి ముద్దయిన ఆమె పువ్వుల పరికిణీ మోకాళ్ళకు అంటుకుపోయి. నడుస్తున్నప్పుడు మెత్తగా వింతశబ్దంచేస్తోంది.

తలుపు తెరచిన నందయ్యకు ఎదురుగా ఒక్కసారి విద్యుల్లత మెరిసినట్లనిపించింది. అతని చింకికళ్ళు సంభ్రమంగా వెలిగాయి. అదేపనిగా కురు

స్తున్న వానజల్లు వేగం హెచ్చి యిద్దరినీ ముంచ్చెత్తింది. నందయ్య చటుక్కున లోపలకి తప్పుకొని, లక్ష్మినికూడా పిలిచి తలమీంచి పెరుగుతట్ట దింపాడు.

"యింకా ఎలుగన్నా రాకుండా ఈ వానేటండే సంపేత్తంది!! " తడిసిముద్దయిన బట్టలను ఓ క్షణం చూచుకొని.. పైట గుండెలమీదనుండి తీసి పిండి .. విదిలించి మళ్ళీ మామూలుగా వేసుకుంది. రెండుచేతులూ దగ్గరగా జేర్చుకుని వేళ్ళు జొని గుండెల మధ్యగా గడ్డం కింద అనించుకొని చలికి సన్నగావణుకుతోంది.

తడిసిన దుస్తుల్లోంచి ఆమెతొలియవనపు మలుపులు తొంగిచూస్తున్నాయి. ప్రతిఒంపులో చిక్కవడిన పరికిణి నుండి దృష్టి మరల్చలేక పోయాడు నందయ్య. నిగ్రహం అదుపుతప్పి తనపైన తోటకొని పువ్వును ఆఘ్రాణించడంలో తప్పులేదని భరోసాయిచ్చింది. మొదట దిగ్భ్రమచెందిన లక్ష్మితీవ్రంగా ప్రతిఘటించింది. ఆపైన మెదడుజీల్చుకున్నా తననేమౌతుందో అర్థకాని అయోమయస్థితి.

అంతవరకు స్త్రీ స్పర్శ ఎరుగని నందయ్య రక్తం అగ్ని ప్రవాహమై పరుగులెత్తింది. కోరిక ఉవ్వెత్తున లేచి పడింది. లక్ష్మిని విశాలత నేత్రాలు. వాస్తవం కోసం వెదకులాడాయి. అనిర్దిష్టమైన స్పందన. అనుభూతుల అంతం చూచిన అనుభవం. అవ్యక్తమయిన భయం.. బాధ . దుఃఖం.. కోపం మరేదో అస్పష్టతా సంజనీతమైన భావం హృదయంలోంచి సుషుప్తిలోనికి --సుషుప్తి నుండి ఆమె హృదయంలోనికి--

లక్ష్మి ఆర్తనాదం బయట వర్షం హోరులో కలిసిపోయింది. ఆ పైన ఆమెకు స్పృహ లేదు.

* * *

"నాకి పెళ్ళొద్దు నేను చేసుకోను. ఈ సిరినేను కట్టుకోను అమ్మ నాకొద్దు." ఏడుస్తోంది లక్ష్మి.

"ష్! నింపాది! అవల అరుగుమీద తుర్రాడికి యినపడద్ది. బెగేకట్టుకునిలెగు. ఎన్నిందాల సెప్పినా మంకుపట్టుమానవే" నరసమ్మ కసరింది ఆ గ్రామంలో వివాహాల తంతు జరిపే చింతాలు, నందయ్య, పెరుగుమామ్మ, యింకా చుట్టు పక్కల పెద్దలు అరుగుమీద కూర్చున్నారు. లక్ష్మివంటి రంగుకి అతికినట్లు సరిపోతుందని కనకాంబరం రంగుచీర తెచ్చాడు నందయ్య. ఆచీరకట్టుకొని లక్ష్మి యిప్పుడు పెళ్ళిచూపులకుహాజరుకావాలి! పదినిముషాలు గడిచాక నర్సమ్మ బయటకు వచ్చి— —

"లచ్చి మీ ఎదరకి రాటానికి సిగ్గు పడుతున్నది చింతాలు మావయ్య! అయినా! ఆరిద్దరికి సూపులు ఎప్పుడో అయినయ్ గదా!" అందికంగారునణుచుకుంటూ-- నందయ్య నిరుత్సాహ పడిపోయాడు.

"అదేంకుదరదు. తంతు అన్నాక తంతే తీసుకురండి" అన్నాడు చింతాలు. పెరుగుమామ్మ కూడాలోపలికి వెళ్ళి చీర

హీనత నరసమ్మ గుండెల్ని పిండింది. ఎన్నడూ తన మాట కెదురుచెప్పని కూతురు యిలా వ్యతిరేకిస్తుంటే ఆమె తల్లి మనసు శంకించింది. తనకి లోకంలో లక్ష్మికంటె విలువైన దేమీలేదు. అలాంటి లక్ష్మికి తను బలవంతం పెళ్ళి చేస్తోందా? యింతలో పెరుగుమామ్మ వచ్చింది. లక్ష్మి యింకా ఏడుస్తూనే ఉంది. ఎంత తరచి తరచి అడిగినా కారణం చెప్పదు!

పెళ్ళి మానేస్తామని యిద్దరూ గట్టిగా చెప్పిన తరువాత ఆ వర్షంనాడు నందయ్య ఎంత పాపానికి ఒడిగట్టింది పూస గుచ్చినట్లు చెప్పింది. అంతా విన్నాక పెరుగుమామ్మ పడి పడి నవ్వింది నరసమ్మ మాత్రం నవ్వలేకపోయింది. క్షణం క్రితం లక్ష్మికి యిష్టంలేని సంబంధం అదెంత గొప్పదైనా సరే చెయ్య కూడదనుకుంది, కాని లక్ష్మి చెప్పిన అవాంఛనీయ సంఘటన తరువాత పెళ్ళి తప్పని సరి! లక్ష్మి జీవితం నాశనమయ్యాక కూడా.... ముందుకొచ్చిన నందయ్య సంస్కారం ఆమె కెంతైనా ఊరట కలిగించింది.

"అమ్మా.. !"తల్లి నిడుదిపింది లక్ష్మి.

నరసమ్మ ఈ లోకంలోకి వచ్చి—

"పిచ్చితల్లి.... నువ్వెలా బతుకుతావో" ప్రేమగా కూతుర్ని దగ్గరకు తీసుకుంది.

లక్ష్మిని బయటకు వెళ్ళమని చెప్పి. నరసమ్మ దగ్గరగా వచ్చింది పెరుగు మామ్మ.

"భయం పడింది.... ఎత్రికూన!" అంది చెవిదగ్గర గుసగుసలుగా.

ఇంతకు తన పెళ్ళి చేస్తున్నారో. మానుతున్నారో తెలియని అయోమయ స్థితిలో పడిపోయింది లక్ష్మి.

* * *

మొత్తంమీద లక్ష్మితో నందయ్య పెళ్ళి విషయం మండపాక గ్రామపంచాయతీ ఆఫీసులో పెద్ద సంచలనం కలిగించింది. తలొకవిధంగా వ్యాఖ్యానించారు.

ఆ రోజు పెళ్ళిరోజు!!

తల్లిదండ్రులు ఎలా ఉంటారో తెలియని నందయ్య వారికోసం కళ్ళ నీళ్ళు పెట్టుకొన్నాడు. నందయ్య కంట తడి చూచి అతని సహోద్యోగి ఆది నారాయణ కొంచెం చలించాడు. పెళ్ళి పనులలో అతనే నందయ్యకు పూర్తిగా సహకరించాడు. ఆఫీసులో అందరిని పేరు పేరున పిలిస్తే ఎవ్వరూ రాలేదు. ఒక్క ఆదినారాయణ మాత్రమే బయలు దేరాడు.

బయట వీరయ్య తొందర పెట్టడంతో యిద్దరూ వచ్చి బండిలో కూర్చున్నారు. బండి పుంతలో జోరుగా పోతోంది.

"ఏవయ్యా! మీవాళ్ళ ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయా?" పెళ్ళికొడుకు తరపున ఆదినారాయణ ప్రశ్నించాడు.

"ఇంకా సక్కా మెడతన్నారండి .... కొంచెం ముందే మిమ్మల్ని తీసుకు రమ్మని పెరుగుమామ్మ నన్ను పురమా



కట్టబెట్టి కొంచెం ఆలస్యంగానే లక్ష్మిని పెళ్ళిచూపులకు తీసుకొచ్చింది.

లక్ష్మి తనువు అణువణువు చిగురుటాకులా కంపించిపోయింది నందయ్య ఎదుట కూర్చోటానికి ఆమె శరీరం గగుర్పొడిచింది. ఆమె మనస్సు గతించిన అనుభవాన్ని తట్టుకొనలేక పోయింది.

పెళ్ళిచూపులు ముగిశాక కొద్దిపాటి తర్జన భర్జనలతో ముహూర్తం నిశ్చయమైంది, పెరుగుమామ్మ నందయ్యను సాగనంపడానికి వెళ్ళింది. లక్ష్మి సుడిగాలిలో పలికొచ్చి తల్లిని వాటేసుకుంది.

"అమ్మా! నాకీ పెళ్ళొద్దు. నామాట వినమ్మా!" ఏడ్చింది.

స్త్రీ సహజమైన మాతృత్వపు బల

యించిందండి....." వీరయ్య హుషారుగా సమాధానం చెప్పాడు. బండి తాళ్ళ చెఱువు దగ్గరకు వచ్చింది. వీరయ్య ఉలిక్కిపడ్డాడు. లక్ష్మి కనుక యిప్పుడు బండిలో ఉంటే చెఱకుముక్కలు తెమ్మని గొడవపెట్టేది. బుల్లిబుల్లి గౌనులు వేసుకుని తన భుజాలమీద ఆడుకున్న లక్ష్మి తనకింకా గుర్తుంది. అప్పుడే పెళ్ళి కూతురై పోయింది! వీరయ్య గుబురు మీసాల మాటున సంతృప్తికరమైన చిరునవ్వు చిందులాడింది.

బండి కొండాయిపాలెంలో ప్రవేశించింది.

నరసమ్మ యింటిదగ్గర బండి ఆపి సామానులు దింపుతున్నాడు వీరయ్య. నందయ్య, ఆదినారాయణ లోపలికి అడుగుపెడుతుంటే అంతా గొడవ గొడవగా ఉంది. లోపల పెరటిభాగంలో సన్నగా ఏడుపులు.... శోకాలు వినిపిస్తున్నాయి.

అటుతిరిగిన నందయ్యను, ఎన్నడూ లేని అలంకరణలలో నూతన వధువుగా అంతిమయాత్రకి సిద్ధమౌతున్న లక్ష్మి శవం ఆహ్వానించింది!!

శరీరంలో రక్తమంతా ఒక్క క్షణం ప్రచండవేగంతో వెనక్కి ప్రవహించి గుండెల్లో గడ్డకట్టింది. విద్యుద్ఘాతం తిన్నట్లుగా దిగ్భ్రమచెందాడు నందయ్య. లక్ష్మి తల్లి నరసమ్మ ఆ శోకంతో సంబంధంలేనట్లుగా, కొత్తగా పెట్టించిన నూతి బరలకేసి తలబాదుకుంటోంది. ఎంతమంది లాగినా రావడంలేదు.

బండి ఒక్క ఉదుటున దూకిన వీరయ్య లక్ష్మినిచూసి చిన్నపిల్లవాడిలా బావురుమన్నాడు.

పచ్చని మామిడితోరణాలతో కళకళలాడుతున్న పెళ్ళిపందిరి క్రింద చాలామంది మూగిఉన్నారు. వారంతా నందయ్యను చూడగానే 'అతనే పెళ్ళికొడుకు' అంటూ గుసగుసలాడారు. పెదనమ్మ నందయ్యని చూసి అక్కడినుండి లేచి వచ్చింది.

"వచ్చావా బాబూ.... చూడు నాయినా, లోకంమీద అందరి తీరుకాకపోయిన దాని బతుకు. ఆనూతిలోపడి ప్రాణంతీసుకుంది. నాకీ పెళ్ళొద్దని నెత్తీనోరు కొట్టుకుంది నా తల్లి! పాపిష్టిముండని.... యిన్నాను గాదు" నందయ్య రెండు చేతులు పట్టుకొని గొల్లుమంది.

"లక్ష్మి ఈ పెళ్ళి వద్దందా!?" నందయ్యలో వేయి అగ్నిపర్వతాలు ఒకేసారి బ్రద్దలయ్యాయి.

తెల్లవారిఝామున పడ్డ చినుకులకు నేలంతా బురద అయింది. లక్ష్మిని ఆఖరిసారిగా మూడ్డానికొచ్చిన జనం తొక్కిసలాటలో, ఆమె అపురూపంగా పెంచుకున్న మందారపు మొక్క విరిగిపోయింది.

ఆ రోజు లక్ష్మితల నలంకరించవలసిన ఒకే ఒక ముద్దమందారం మట్టిలో కలిసిపోయింది.